ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక - 31, జనవరి 1975

# కాలానికి కళ్లెం

తల్లిదండ్రులు బ్రతిమలాడారు. అన్న వెంకటేశ్వర్లు ఒకటి రెండుసార్లు చెప్పాడు. మంచం మీది బామ్మ కన్నీళ్ళు పెట్టుకుని, ఆపైన గెడ్డం పుచ్చుకుని నచ్చజెప్పింది.

కానీ - అరుణ మాత్రం యెవరెన్ని చెప్పినా ఒప్పుకోలేదు, అందరితోనూ ఒకే మాట చెప్పింది.

"నేను, రాజుని పెళ్ళి చేసుకోను" అని.

రాజు చాలా బుద్ధిమంతుడు. చదువుకున్నాడు. ఉద్యోగం చేస్తున్నాడు. మంచి కుటుంబంలోంచి వచ్చాడు. అతన్ని మించిన వాళ్ళు లేరనం. కానీ మేం యితన్ని మించిన వాణ్ణి తేలేం అని నీకూ తెలుసు. ఆడపిల్లకి పాతికేళ్ళు దాటినా పెళ్ళి కాలేదంటే, ముందు ముందు మరీ కష్టం. యెంతకాలమని వొక్కత్తివీ ఉద్యోగం చేసుకుంటూ బ్రతుకుతావు. మా తరవాత నిన్ను చూసేదెవరు? రేపేదయినా అయితే మేం తల తీసుకువెళ్ళి యెక్కడ పెట్టుకోవాలో చెప్పు. తీరా ముహూర్తం పెట్టించిన తర్వాత నీకేం పోయేకాలం వచ్చింది."

యిలా యెవరెన్ని అన్నా, యెన్ని రకాలుగా చెప్పినా అరుణ కిమ్మనలేదు. జవాబు చెప్పలేదు.

❖ ❖ ❖

వెంకటేశ్వర్లు నాకు ప్రాణస్నేహితుడు, వాళ్ళ అమ్మగారి దగ్గరా, నాకు బాగా చనువుంది. అరుణకి కూడా నా దగ్గర చనువుంది. చిన్నప్పటి నుంచీ, నేను, వెంకటేశ్వర్లూ అరుణా ఒకే స్కూల్లో చదివాం. కాలేజీలో కూడా మా స్నేహం బలపడింది. మాకు రహస్యాలు లేవు. అరమరికలు లేవు. అందుకే అనుకుంటాను – వెంకటేశ్వర్లు నాకు కబురు చేసి జరిగిన సంగతులన్నీ పూసగుచ్చినట్టుగా చెప్పగలిగాడు. మొదట నేను నమ్మలేదు.

"నిజంరా, చూస్తే దానికి పిచ్చెక్కిందనిపిస్తోంది."

"ఛా, ఛా" అన్నాను, మరేం అనలేక –

"రాజుతో యేమని చెప్తాం" వెంకటేశ్వర్లు తనలో తను గొణుక్కున్నట్టుగా అని, తిరిగి మొదలుపెట్టాడు.

"యేడాదిగా వాళ్ళిద్దరూ కలిసి తిరిగారు. పెళ్ళి చేసుకుందాం అనుకున్నారు. ఈ విషయం అందరికీ తెలుసు. తీరా ముహూర్తం పెట్టిన తర్వాత యిది మొండికేస్తోంది.

నేనేం మాట్లాడాలో తెలియడం లేదు.

"యేది ఏమైనా సరే, ఈ పెళ్ళి జరిగి తీరాల్సిందే. మా చెల్లాయి పెళ్ళికి వప్పుకోవడం లేదు. మేం యేం చెయ్యాలీ అని యే మొహం పెట్టుకుని రాజు దగ్గరకి వెళ్ళాలిరా" వెంకటేశ్వర్లు అలంగం తొక్కుతున్నాడు.

"వాళ్ళిద్దరి మధ్యాయేమన్నా గొడవలు వచ్చాయేమో రాజు నీకేం చెప్పలేదా?"

"రాజుని నిన్న కలిశాను నేను. అతను మామూలుగా వున్నాడు" వెంకటేశ్వర్లు బాధ నాకు అర్థమవుతూనే ఉంది.

అరుణ తన కొలీగ్‌ని ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని చెప్పిన రోజున వాడేం అగ్గి మీద గుగ్గిలం కాలేదు. అలాగే తల్లిదండ్రులు సనాతనంగా యేడ్చి మొత్తుకోలేదు.

అయితే ఇంత హఠాత్తుగా అరుణ ఆఖరి నిముషంలో తన ఉద్దేశం మార్చుకుని అందరి మనసుల మీదా హఠాత్తుగా దాడిచేసి వాళ్ళ సంతోషాన్ని యెందుకు చిందర వందర చేయాలనుకుంటోంది?? అందరి మాటా వదిలేసినా, కనీసం తన భవిష్యత్ గురించి కూడా ఆలోచించడం లేదా??

"ఒరేయ్ శివం. మేం అందరం చెప్పాం. నువ్వొక్కడివే మిగిలావు. దాన్తో మాట్లాడి దాని వుద్దేశం యేమిటో తెల్సుకోరా, నాకు మతిపోతోంది" వెంకటేశ్వర్లు దీనంగా అన్నాడు, నా చేతులు పుచ్చుకుని.

"నువ్వింతగా అడగాలా నన్ను! పెళ్ళింకా నెల వుందిగా నాక్కొంచెం టైమివ్వు. అరుణతో నేను మాట్లాడతా" అన్నాను.

వెంకటేశ్వర్లు కృతజ్ఞతతో నా వైపు చూశాడు.

వాడి భుజం తట్టాను. వీపు నిమిరాను. అంతే!

❖ ❖ ❖

అరుణ ఆఫీసు నుంచి తిరిగి వచ్చే సమయానికి భాను గుడి దగ్గర కాపేసి, నేనే ముందుగా పలకరించాను.

"కులాసానా" అని.

"ఆ నీ దయవల్ల"

"అది సరే. నీతో అర్జంటుగా మాట్లాడాలి. అలా పోలీసు క్వార్టర్స్ దాకా నడుద్దామా" అన్నాను.

"యెందుకో"

"సాధారణ విషయమే"

"అంటే"...

"వెంకటేశ్వర్లు చెప్పిన విషయమే అరుణా. యిదేమన్నా బావుందా" అన్నాను.

"యేం చేయను. మరి" అంది అదోలా.

"నిన్నటి దాకా రాజుతో యెందుకు స్నేహం చేశావు. పెళ్ళి చేసుకుంటానని యింట్లో యెందుకు చెప్పావు. వాళ్లు ముహూర్తం కూడా పెట్టిన తర్వాత పెళ్ళి యెందుకు వద్దంటున్నావు" గబగబా అడిగేశాను.

"యివన్నీ చెప్పి నాకూ, విని నీకూ లాభం వుండదనిపిస్తోంది"

"ప్రతి విషయంలోనూ లాభనష్టాల లెఖ్ఖలు వేసుకుని బ్రతుకుని చిట్టా ఆవర్జాల పుస్తకం చేసుకుంటారా యెవరైనా."

అరుణ నవ్వేసింది. "నిజమే అనుకో. కానీ ఓ సంగతి. గోతిలో పడుతున్నామని తెలిసి వెనకడుగు వేయడం లాభం. గోతిలో పడి కూడా యేవీ యెరగనట్టు భుజాలు దులిపేసుకోవడం నష్టం. అవునా".

ఆకాశం ఆఫీసు మీదకి డ్యూటీ చేయడం కోసం నక్షత్రాలు బద్ధకంగా ఒక్కొక్కటిగా వస్తున్నాయి.

"ముసిలివాళ్ళు నీ మాట యెప్పుడూ కాదనలేదు. వెంకటేశ్వర్లు సరేసరి. వాళ్ళ మంచితనానికి మంచి కితాబే యిస్తున్నావు నువ్వు. ఈ వేళ పెళ్ళి చేసుకంటాననడం – తెల్లారికాదు అనడం – ఇలా చిన్న పిల్లలు కూడా అనరే. పెళ్ళంటే బొమ్మల పెళ్ళి కాదు ప్రేమంటే యెక్సపరిమెంటూ కాదు" అరుణ తల వంచుకుంది.

"ఇంట్లో అయితే తేలిగ్గా చెప్పేశావు. ఈ విషయం రాజుతో యెవరు చెప్తారు. అరుణ తొందరపడింది, క్షమించు అని యెలా అడగమంటావు."

"అవును, అదే నేనూ ఆలోచిస్తున్నాను" అంది నెమ్మదిగా.

"యెలా అతనితో చెప్పాలనా, నీ ఉద్దేశం మార్చుకుందామనా"

"ఊహూ" అంది.

"కారణం?"

"శివం, ఇంతవరకూ నాన్నతో, అన్నయ్యతో ఆఖరికి నా ప్రాణ స్నేహితులతో కూడా చెప్పలేదు."

ముసురుకున్న చీకటి చెవులు రిక్కరించుకుని వింటోంది.

"అంతా విని నేను పిచ్చిదాన్నంటవేమో? కానీ నేనేం చేయను? నా మనసు ఒప్పుకోవడం లేదు"

"యేం జరిగిందసలు" ఆతృతతో అడిగాను.

"రాజంటే నాకు కోపం లేదు. అయిష్టం లేదు. కాని అతన్ని నేను కొనుక్కోలేను"

నాకేం అర్థం కాలేదు.

"అవును. రాజుతో చాలాసార్లు చెప్పాను. సరేనని కూడా అన్నాడు. కానీ నాన్నా అన్నయ్యా ఆరువేలు కట్నం ఇస్తానంటే చల్లగా తలూపాడు."

నాకు నవ్వొచ్చింది. "వాళ్ళకిష్టం అయి యిస్తున్నారేమో! అతను బలవంతపెట్టాడని నమ్మకం ఏమిటి నీకు?"

"రెండూ ఒకటే విశ్వం. ఈ విషయం నాకు నచ్చదు. యెందుకో నాకే తెనియదు. నేను కొనుక్కున్న మగాణ్ణి భర్తగా నేను వప్పుకోలేను. ప్రేమించాలేను"

"కొనుక్కోవడమేమిటోయ్ ఇది ఇప్పుడు 'యీవిల్' అయ్యుంది గానీ – పూర్వంలో అర్థం వున్నతంతే, నీ పొట్ట గడవడం కోసం అత్తింటికి నువ్వు డబ్బు తీసుకువెడుతున్నావు. కట్నాలతో అత్తింటికి వెళ్ళిన వాళ్ళకి స్వాతంత్ర్యం కోసం పోరాడే హక్కు ఉంటుంది. తెలుసా" నవ్వుతో అన్నాను.

"ఈ రోజుల్లో తిరగ మరగ అయ్యింది కూడా. డబ్బు తెచ్చుకోని ఆడదాన్ని పని మనిషిలా చూస్తాడు మగాడు."

"అది సరే యింత చిన్న కారణానికి అతన్ని వద్దంటున్నావా" అరుణ నా వైపు చూసింది.

"నీకు చిన్న కారణంగా వుండచ్చు. కొందరు దేనికీ చలించరు. కష్టాలకీ, కన్నీళ్ళకీ కరగరు వాళ్ళని మనం బండలు అంటాం. అసహ్యించుకుంటాం. మరి కొంతమందికి ఆదర్శాలు, నిష్కల్మషం. నీతి పట్ల బోల్డు ప్రేమా వుంటాయి. కాని యివి వుండడం మూర్ఖత్వం, ఛండాలం అనగలమా చెప్పు."

"యిది జీవితం అరుణా"

'అంటే ... స్వంతానికి ఆదర్శాలు పని చేయకూడదంటావ్ అంతేనా..."

నాకేం చెప్పాలో, యెలా చెప్పాలో తెలియలేదు. ఆదర్శాలు పాటించాలి. యెంత వరకూ అనే ప్రశ్న పుట్టకూడదు. అలా పుడితే అది స్వార్థ చింతనకి దారితీస్తుంది. మనల్ని

వొదిలేసుకొని చుట్టూతా అందరూ నీతి నిజాయితీలు పాటించాలి అంటూ ఉపన్యాసాలు తయారుచేసుకోవచ్చు. కాని అప్పుడది అరణ్యరోదన అవుతుంది...

"పద వెనక్కి నడుద్దాం దూరం రావడమే కాదు. చీకటి పడిందని కూడా మర్చిపోయాం" అనేశాను.

యిద్దరం వెనక్కి తిరిగాం...

"అయితే యేం చేద్దామనుకుంటున్నావు"

"నువ్వు దేవుడు పంపించినట్టు వచ్చావు శివం. నువ్వే వెళ్ళి రాజుతో మాట్లాడు. కట్నం సంగతి వదిలేస్తే నాకు మరేం అభ్యంతరం లేదు. నన్ను అర్థం చేసుకోమని చెప్పు. నేనేదో గొప్పదాన్ననీ, నేను అతనికన్నా ఎత్తుగా యెదిగిన దాన్ననీ నాకేం గర్వం లేదు. మనసుని మభ్యపెట్టుకోవడం చేతకానిదాన్ని నేను."

"నువ్వు మరీ సెంటిమెంటల్ అయిపోయావు" అన్నాను.

అరుణ నవ్వింది... ఆమె కంఠం వణికింది...

"వెడతావా శివం, రాజుతో మాట్లడతావా."

నేనేం జవాబు చెప్పలేకపోయాను. కానీ అప్రయత్నంగా నా నోటి నుంచి ఓ ప్రశ్న వచ్చింది.

"రాజు నిన్ను నిజంగా ప్రేమించాడా అరుణా."

అరుణ ఆశ్చర్యంగా నా వైపు చూసింది.

❖ ❖ ❖

శివం అనే మధ్యవర్తి రాయబారిగా వచ్చి అరుణ ఉద్దేశం చెప్పడంతో మొదట రాజు నమ్మలేదు.

అరుణని ప్రేమించాడు. కాదనలేదు. కానీ అంతమాత్రం చేత అరుణ పెట్టే షరతుకు కట్టుబడి వుండాలనిపించడంలేదు. అరుణ ఉద్దేశం చాలామటుకు నువ్వెంత అని సవాల్ చేస్తోన్నట్టుగా వుంది.

నిజమే. అటూ ఇటూ పెద్దవాళ్ళు యెవరు కాదన్నా పెళ్ళి చేసుకుందామనే నిర్ణయించుకున్నారు. చీకాకులు, అడ్డంకులు అధిగమించాలనుకున్నారు.

కానీ అరుణ ఓ చిన్న విషయం ఆసరాగా తీసుకుని తన వ్యక్తిత్వానికి పరీక్ష పెట్టడం అతనికి చిన్నతనంగా అన్పించింది, అవమానంగా తోచింది.

తను కట్నం అడిగాడు. అంతేగానీ వాళ్ళని ఇంత ఇవ్వమని బేరం పెట్టలేదు. ఈ రోజుల్లో కట్నం తీసుకోవడం నేరమే అయినా ప్రజల్లో మాత్రం కట్నం అంటే విముఖత లేదు. యిచ్చేవాళ్ళ సంఖ్యా, పుచ్చుకునేవాళ్ళ లెక్కలూ పెరుగుతూనే వున్నాయి. పైగా ఆ కట్నం యివ్వడంలో తీసుకోవడంలో నామర్దా కాకుండా దర్జా హోదా ప్రతిధ్వనిస్తున్నాయి.

మగవాడి అండదండలతో, సహాయ సహకారాలతో బ్రతకాల్సిన ఆడది – మగవాణ్ణి

హీనపరిచేటంత యెత్తుకు, యెదగడం వేలెత్తి చూపించేటంత గొప్పది కావడం సమాజ శ్రేయస్సుకే గొడ్డలిపెట్టు. ఈ రోజుల్లో చదువుకున్న ప్రతి ఆడదీ తనే సంఘానికీ దారి చూపే దివ్వె అనుకుంటోంది. మగవాణ్ణి ధిక్కరించడం ధ్యేయంగా పెట్టుకుని దానికి స్వేచ్ఛ కోసం పోరాటం అని పేరు పెట్టుకుంటోంది.

రాజు – అరుణకి గట్టి పాఠం నేర్పాలని నిశ్చయించుకున్నాడు. అప్పుడే అతనికి కొంత విశ్రాంతి లభించింది. గబగబా అరుణ పేర వుత్తరం రాశాడు.

"అరుణా....

శివంగారు నాకు అన్ని విషయాలూ చెప్పారు. వెంటనే నీ అమాయకత్వానికి పెద్ద నవ్వు వచ్చింది. యింత చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటావని నేననుకోలేదు. మనిషన్న తర్వాత కొన్ని నమ్మకాలతో, ఆదర్శాలతో యెదుగుతాడు. నమ్మిన నిజం కోసం ప్రేమించినవాణ్ణే త్యాగం చేసుకుందుకు సిద్ధపడ్డ నిన్ను నేను పొగడలేను. యెప్పుడూ ప్రేమిస్తూ వుంటానని మాత్రం మాటిస్తున్నాను. రేపు సాయంకాలం గాంధీనగరం పార్కులో కల్సుకుందాం. అప్పుడు అన్ని విషయాలు చెప్తాను.

నీ రాజు"

❖ ❖ ❖

పెళ్ళి వారిల్లు హడావిడిగా వుంది. వీధి అరుగుల మీద బేండు వాయిద్యగాళ్ళు తెలుగు, హిందీ సినిమా పాటలు జోరుగా వాయిస్తున్నారు. ఓ పక్క వయసుకారు యువకులు గేస్‌లైట్ల చుట్టూ చేరి పేకాడుకుంటున్నారు. కొత్త చీరలు కట్టుకున్న ఆడపడుచులు అటూ యిటూ తిరుగుతూ చీరల ప్రదర్శన పోటీ జరుపుతోన్నట్టు వున్నారు.

"విడిదిలో స్నాతకం అయిందిటా?" యెవరో అడుగుతున్నారు.

"అయ్యే ఉంటుంది. మీరు పెళ్ళి కొడుకు కాశీయాత్రకు అన్నీ సిద్ధం చేయండి. పెళ్ళి కూతురి అన్నగారికి బెల్లం ముక్కా కొత్త బట్టలూ యిచ్చి పందిట్లో తయారుగా వుండమనండి."

వెంకటేశ్వర్లు అన్నీ సిద్ధం చేసుకుని వీధిలో నుంచున్నాడు. విడిది అక్కడికి ఓ ఫర్లాంగు దూరంలో వుంది. మగపెళ్ళి వారు కుదుర్చుకున్న టాక్సీ చీకటిలోంచి దూసుకువచ్చింది. కానీ అందులో పెళ్ళి కొడుకు లేడు. పెళ్ళి కొడుకు తల్లీ, తండ్రీ లేరు. అక్క చెల్లెళ్ళు లేరు. ఓ దూరపు బంధువు మాత్రం టాక్సీ దిగాడు.

"వీళ్ళే రండి – ఇంకా తంతు పూర్తి కాలేదా?"

"తంతూ, గింతూ లేదు. ముందిటు రావయ్యా" అంటూ వెంకటేశ్వర్లుని ఓ మూలకి తీసుకువెళ్ళి చేతిలో ఉత్తరం పెట్టాడు. అది –

పెళ్ళికొడుకు తండ్రి రాసిన ఉత్తరం :

"వియ్యంకుడు గారికి –

మాకు మీ అమ్మాయి గురించి వారం పది రోజులుగా రకరకాల వార్తలు అందుతున్నాయి. వాటిని విడమర్చి రాయడం అనవసరం. పెళ్ళికి ముందే మీ అమ్మాయి యెవర్నో ప్రేమించిందనీ, తీరా యేదో గొడవలు జరిగాయని తెలిసింది. యివన్నీ నిజామా కాదా రుజువు చేసుకోవల్సిన అవసరం లేదేమో! అతగాడు మా అబ్బాయికి బాగా స్నేహితుడు. మేం నమ్మక తప్పలేదు. మా వాడు బాగా డీలాపడ్డాడు. జరిగిందానికి మేం చింతిస్తున్నాం. పెళ్ళి ఆగిపోవడానికి బాధ్యత పూర్తిగా మీదే".

వెంకటేశ్వర్లు ఖిన్నుడయ్యాడు. పెళ్ళింటిలోకా. విడిది వైపా యెటు పరిగెత్తాలో తేల్చుకోలేక నీర్సంతో జావకారిపోయాడు.

వెనక్కి తిరిగి చూస్తే వాకిట్లో వేసి వుంచిన పెళ్ళి పీట, చెల్లెలి కోసం పరిచిన ఏడు కట్ల నిచ్చెనలా కన్పించింది. బ్రాహ్మణులు పేర్చిన అగ్నిహోత్రం మండుతోన్న కాష్టంలా తోచింది. వీధి అరుగు మీద భజంత్రీలూ, బాజాల్లా వినపడ్డం మొదలుపెట్టాయి.

❖ ❖ ❖

సామర్ల కోట రైల్వేస్టేషన్ వెయిటింగ్ రూమ్‌లో, ఫ్రేము కుర్చీలో అడ్డంగా పడుకని హాయిగా సిగరెట్ తాగుతున్నాడు రాజు. అతనికెంతో హాయిగా ఉంది. వుండుండి పెదాల మీద నవ్వు నాట్య సుందరిలా కదుల్తోంది. యెంత వద్దనుకున్నా అరుణ మొహమే గుర్తొస్తోంది.

అదర్శ నారీమణి – పెళ్ళి పందిట్లో కూర్చుని శోకగీతాలు పాడుతుందా? లేక అగ్నిహోత్రంలో దూకి తను పవిత్రురాలనని నిరూపించుకుంటోందా? యేం చేస్తూ వుంటుంది.

నుదిటి మీద కల్యాణపు బొట్టు, బుగ్గన చుక్క, తలంటిపోసుకుని వదులుగా జడ అల్లుకుని, పువ్వులు తురుముకని, మధుపర్కం కట్టుకుని పెళ్ళిపందిరి అదిరిపోయేటట్టు ఉపన్యాసం యిస్తోందా?

వెయిటింగ్ రూమ్‌లోకి వెంకటేశ్వర్లు, రాజశేఖరంగారు, శివం రావడం అతను చూడనే లేదు.

"రాజూ" అన్నాడు ప్రాధేయపూర్వకంగా వెంకటేశ్వర్లు.

"నాయనా, యిదేం పని బాబూ."

"నీకు అన్నీ తెలుసు – అరుణ జీవితం తోనా నువ్వు వేళాకోళం ఆడబోయేది."

రాజు చలించలేదు. పడుకున్న వాడు మాత్రం లేచి, కూర్చున్నాడు.

"అదీ – దాని గుణం నీకు తెలుసు."

"మా చెల్లెలికి నీ ప్రేమ కన్నా మంచి మంచి సర్టిఫికెట్ యెవ్వరివ్వగల్రు రాజూ."

శివం అన్నాడు... "అరుణకి ఆవేశం యెక్కువ. కాలం పోకడ దానికి తెలియదు. తెలిసిందల్లా మనసుకు తోచింది నచ్చింది మాట్లాడడం ఆచరణలో పెట్టుకోవాలని కలలు

కనడం".

"యిప్పుడా అవకాశం పోలేదుగా" రాజు కటువుగా అన్నాడు.

"దాన్ని నువ్వే క్షమించాలి. దానికి నువ్వు తప్ప దిక్కులేదు. నీ కాళ్ళు పట్టుకుంటాం. చచ్చి నీ కడుపున పుడతాం. మా పరువు నీ చేతుల్లో వుంది. అది నీకు క్షమాపణ చెబుతుంది. మేం చెప్పిస్తాం." యిలా రకరకాలుగా వెంకటేశ్వర్లూ, రాజశేఖరంగారూ మాట్లాడి, ప్రాధేయపడి రాజు కాళ్ళూ, గెడ్డం పుచ్చుకుని బ్రతిమలాడి బయటకు తీసుకు వచ్చారు.

రాజు కళ్ళు విజయగర్వంతో మెరిశాయి. అతని ఆత్మ ఘోషించడం ఆపింది. పగ చల్లారింది. పూనకం తగ్గింది.

టాక్సీ కాకినాడ వైపు తిరుగుమొహం పట్టింది.

❖ ❖ ❖

బ్రాహ్మలు ఉత్సాహంగా మంత్రాలు చదువుతున్నారు. ఆ మంత్రాలు అర్థం కాక పోయినా అర్థమయినట్టు వల్లె వేస్తున్నాడు రాజు.

"పెళ్ళి కూతుర్ని తీసుకురండి" పెళ్ళి చేయిస్తున్న పురోహితుడు ఓ కేక పెట్టాడు.

రాజు తన పక్కన ఖాళీగా వున్న చోటు చూశాడు. కొంచెం వెనక్కి కళ్ళు మాత్రం తిప్పి చూడబోయాడు. రాజు పెద్ద అక్క అటుగా వచ్చి రాజు చేతిలో ఓ చీటి వుంచి – "నీ కిమ్మన్నారు" అంది.

రాజు గ్రీటింగ్ అనుకుని విప్పాడు.

అప్పుడు రాజుకి పక్కనే మంత్రాలు చదివే బ్రాహ్మడు. తల్లిదండ్రులు, చుట్టాలు, ఆ ప్రదేశం యేదీ,కన్పించడం లేదు. తల మీద పిడుగులు పడుతోన్నట్లు, మెదడులో బాంబులు పేలుతోన్నట్టుగా వుంది.

"మహారాజా –

సారీ మచ్చలేని మహారాజా – నీలాంటి వాడికి భార్యగా – నీ చేత తాళి కట్టించుకునే అర్హత నాకు లేదు. ఈ అదృష్టం తప్పిపోయినందుకు నేను బాధపడుతూనే నీకో చక్కని సుందరి, పెళ్ళాంగా రావాలని కోరుతున్నాను. నువ్వు చరిత్ర హీనుడవనీ, గుణశాలివి కావనీ నిందించే భాగ్యం నాకు లేదు. కారణం నేను ఆడదాన్ని కాబట్టి. తెలివి తక్కువగా నిన్ను నేను తిట్టి నీకు నిందలు ప్రసాదించినా, నిన్ను పెళ్ళాడ్డానికి ఈ దేశంలో చాలామంది అమాయకులైన ఆడపిల్లలు వున్నారు. యిది నీకు అవమానం కాకూడదు. నీ కుచ్చుల టోపీకి ఓ కలికితురాయే అవ్వాలి రాజూ – ఓ గంట నన్ను కాదని నన్నో మనిషిగా మార్చినందుకు, నీకు నా కృతజ్ఞతలు. అలాగే నిన్ను కాదని – పరోక్షంగా నీకు నేనేమైనా వుపకారం చేసిందీ లేనిదీ కాలమే తేల్చాలి. వుంటాను.

– అరుణ"